# బాధ్యత

-సి.వి.నరసింహదాసు

ఏదో గమ్మత్తయిన వాసన ముక్కుపుటాలకు సోకుతుంటే నాకు స్పృహ వచ్చినట్లు గ్రహించాను. మెల్లగా కనురెప్పలని కదిలిస్తూ తెరిచి చూడడానికి ప్రయత్నిస్తుండగానే మృదువైన స్పర్శ నన్ను పరామర్శించింది.

"అమ్మా..నాన్నా...అన్నయ్యా లేచాడు చూడండి" అంటున్న ఆత్మీయత నిండిన ఆ గొంతు, నా ముఖం మీద ఆ చేతి స్పర్శ. అవి నా చిన్నారి చెల్లాయి శైలివని గుర్తించాను.

ఎదురుగా అమ్మానాన్న, సూర్యం మావయ్య, నళినీ ఆంటీ, నాన్నమ్మ...ఆత్రుతగా నాకేసే చూస్తున్నారు. అందరి కళ్లల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు నా దృష్టిని దాటిపోలేదు.

"చిన్ని కన్నా" అమ్మ ఆప్యాయంగా నన్ను పిలిచే పిలుపు.

గొంతు రుద్ధమైందేమో. ఏదో అడగబోయినా అంతకన్నా మాట్లాడలేక ఆగిపోయింది. అందర్లో నాన్న ఒక్కరే కాస్త నిబ్బరంగా కనిపిస్తున్నారు. అలాగని ఆయన ప్రేమలో తక్కువదనాన్ని అంచనా వేయాలని ప్రయత్నిస్తే అది నా మూర్ఖత్వమే అవుతుంది.

నా కళ్ళు వెదుకుతూనే ఉన్నాయి. మరో వ్యక్తి కోసం...

ఏడీ...వాడేడీ..క్షేమంగానే ఉన్నాడు కదా. లేక నాలాగే హాస్పిటల్లో మరో బెడ్ మీద ఉన్నాడా..

వాడు...ప్రదీప్... నా ప్రియనేస్తం.

ఏడీ? నాలో ఏదో ఆందోళన.

అసలు నేనిలా హాస్పిటల్ పాలు కావడానికి కారణం ఏమిటి?

గత నాలుగైదురోజులుగా జరిగిన సంఘటనలు ఒక్కసారి గుర్తుకొచ్చాయి.

★ ★ ★

ఈ సంవత్సరం మా స్కూలు పిక్నిక్‌కి ఋషికొండ బీచ్‌కి తీసుకెళ్తామని క్లాస్ టీచర్ ప్రకటించినరోజు మాలో ఆనందం తాండవమాడింది. అందుకే ఎంతమంది రావడానికి సిద్ధంగా ఉన్నారన్న ప్రశ్నకి దాదాపు అందరం చేతులెత్తేశాం అంగీకారంగా.

"ఒక్కొక్కరికీ రెండువందల రూపాయలు. గురువారం నాటికి ఇచ్చేయాలి. ఆదివారం పిక్నిక్" చెప్పారు టీచర్.

ఆ క్షణం నుంచి మా ఉత్సాహానికి అంతే లేదు. ఏదో తెలీని ఉద్విగ్నత అందరిలో. ఆరోజు ఏమేం చేయాలో నేనూ, ప్రదీప్ అప్పుడే ప్రణాళికలు వేసేశాం.

ఇంటికొచ్చాక గాని తెలీలేదు పొంగుతున్న మా ఉత్సాహంపై నీళ్లు జల్లడానికి పెద్దలు సిద్ధంగా ఉన్నారని...

"నిన్ను ఒంటరిగా పంపడం నాకిష్టం లేదురా" సింపుల్‌గా అనేశారు నాన్న.

నిలువునా నీరుగారిపోయాను. సాధారణంగా నా ఏ కోరికనీ కాదనని నాన్న అలా అన్నారంటే ఏదో కారణం ఉండే ఉంటుందని తెలుసు. అదేమిటో నాకు తెలియాలి.

"రెండొందలే కద నాన్నా... మా ఫ్రెండ్స్ అందరూ వస్తున్నారు. బస్‌లో తీసుకెళ్తారట. కనీసం పదిమంది టీచర్లు మా వెంటే ఉంటారు కదా!" అన్నాను ఒకింత అభ్యర్థనగా.

"ఇక్కడ డబ్బులు ఎంతన్నది కాదురా సమస్య. డబ్బయి ఎనభై మంది పిల్లలు. వెళ్తున్నది బీచ్‌కి. నీళ్లతో ఆటలు మొదలు పెట్టారంటే ఇక ఆపడం ఎవరితరమూ కాదు. అదెంత ప్రమాదకరమో వాళ్ళనెవరు కట్టడి చేస్తారు. తెలిసి తెలిసి రిస్క్ తీసుకోవడం ఎందుకూ.."

నా ఇగో దెబ్బతింది. అంత అజాగ్రత్తగా ఉంటామనా నాన్న ఉద్దేశ్యం. పిల్లలంటే ఈ పెద్దవాళ్ళకెప్పుడూ చులకనభావమే. మా ఫీలింగ్స్‌ని వీళ్ళు ఎప్పటికైనా అర్థం చేసుకోగలరా?

ఏడ్చాను, మొత్తుకున్నాను. మంకు పట్టు పట్టాను. బెదిరించాను. బ్రతిమాలాను. భీష్మించుకు కూర్చున్నాను. అమ్మనాన్నమ్మల సిఫారసు సంపాదించాను.

ఎలాగైతేనేం నాన్న చెప్పే జాగ్రత్తలు అన్నీ తు.చ తప్పకుండా పాటిస్తానని ప్రామిస్ చేసి గెలుపు సాధించాను.

మా ప్రక్కింటి ప్రదీప్ ఇంట్లోనూ ఇదే దృశ్యం. వాడికి నాన్నమ్మ లేదు కాబట్టి ష్యూరిటీ నేనిచ్చాను.

★ ★ ★

ఆటపాటలతో కోలాహలంగా బయల్దేరాయి స్కూలు బస్‌లు పిక్నిక్‌కి.

అబ్బ...ఎంత అద్భుతంగా ఉందో ఋషికొండ బీచ్. సరుగుడు తోటల మధ్య ఎంత ఆహ్లాదంగా ఉందో. చెట్ల మాటునుంచి శీతాకాలపు సూరీడి వెచ్చదనం ఎంత గిలిగింతలు పెడుతోందో దూరంగా కెరటాల హోరును మించి మాలో హుషారు.

మాతో వచ్చిన సార్లు గుంపులుగా మారిపోయి పేకాటల్లో, స్కూలు రాజకీయ చర్చల్లో బిజీగా ఉన్నారు. లేడీ టీచర్లయితే అందం కాపాడుకునే చిట్కాలు గురించి, అక్కడ లేని తోటి టీచర్ల పర్సనల్ వ్యవహారాల గురించి డీప్‌గా చర్చల్లో మునిగిపోయారు. ఫలితంగా పిల్లల్ని అదుపుచేసేవారు లేకుండా పోయారు. ఒక్కరొక్కరుగా పిల్లలు నీటికి చేరువగా వెళ్లిపోతుంటే నేనే అలర్ట్ అయ్యాను.

గోపాలం మాష్టారికి చెబితే పేకాట మధ్యలో డిస్టర్బ్ చేసినందుకు చికాకుపడ్డారు.

"వాళ్ళు నీళ్ల దగ్గరికి పోతున్నారని నీకెందుకురా ఏడుపు. నువ్వు కూడా పోయి దూకు. మజా వస్తుంది" అన్నారు తల తిప్పకుండానే.

"అదికాద్సార్. మీరెవరైనా అక్కడ ఉంటే బాగుంటుంది.." నా మాట పూర్తికాకుండానే విరుచుకుపడ్డారు మరో మాష్టారు.


"ముసలాడిలాగ ఏంట్రా నీ నస. పిక్నిక్‌కి వచ్చేది కాళ్ళుచేతులు ముడుచుకుని ఓ మూల కూర్చోడానికి కాదు. వీడెవడండీ.. శ్రీశ్రీ చెప్పినట్లు కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు కేటగిరీలా ఉన్నాడు..." అదేదో జోక్‌లాగా అందరూ నవ్వుకున్నారే గానీ నా ఘోష వినే వాళ్ళే లేకపోయారక్కడ.

నియంత్రణ లేని పిల్లల అత్యుత్సాహం గట్లు తెంచుకుంది. నీటిలో నిలబడితే కాళ్లకింద జారుతున్న ఇసుక ఏదో ఉల్లాసాన్నిస్తుంటే ఒకరిని చూసి మరొకరుగా లోపలికి మరింత లోపలికి వెళ్తున్నారు.

నాకు, ప్రదీప్‌కి కూడా మనసు ఉద్రేకపడినా నాన్నకిచ్చిన మాట ముందుకి కదలనీయలేదు. వీలున్నంతవరకూ మిత్రుల్ని వారిస్తూనే ఉన్నాం. ఫలితం శూన్యం.

ఇంతలో జరిగిందది. ఒకదానివెనుక ఒకటిగా విరుచుకుపడిన నాలుగు కెరటాలు ఉవ్వెత్తున లేచాయి.

దాదాపు అరవైమంది పిల్లల్ని లోపలికి లాగేశాయి. అలల అంచున శరీరాలు కనిపించాయి. ఆర్తనాదాలు కొద్దిసెకన్లు వినిపించాయి.



"టీచర్...టీచర్" అంత స్పీడుగా పరిగెత్తగలనని నాకే తెలీదు.

నా గొంతు, శరీరం కంపిస్తున్నాయి. విషయం విని పరిగెత్తుకు వచ్చారు వారు.

అప్పటికే ప్రదీప్ నీళ్లలోకి దూకి దొరికినవాళ్లని పట్టుకుని ఒడ్డుకి విసిరేస్తున్నాడు. తోటి పిల్లల ప్రాణాల్ని రక్షించాలనే ఆతృతలో తన రక్షణ సంగతి మర్చిపోయాడు. ఇక ఆగలేకపోయాను. నేనూ వాడికి తోడుగా నీళ్లల్లోకి వెళ్లి సహాయపడసాగాను. ఎంతమందిని రక్షించగలిగామో తెలీదు. ఒక అల బలంగా కొట్టేసరికి నాకు స్పృహ తప్పింది.

మళ్లీ తెలివిరావడం ఇలా హాస్పిటల్‌లోనే..!

నాకు స్పృహ వచ్చిందని తెలిశాక ఇక నా చుట్టూ ఎందరెందరో మూగిపోయారు. పోలీసులు, పత్రికలవాళ్ళు, టీవీ ఛానెళ్ల వాళ్ళు...నన్నేదో అడుగుతున్నారు. నేనేదో సమాధానం చెబుతున్నాను.

నా నిరీక్షణకి సమాధానం వారి మాటల్లోనే దొరికింది. దాదాపు పాతికమందిని రక్షించగలిగాం. మరో నలభైమంది మృత్యువుని తప్పించుకోలేకపోయారు.

నా గుండె బద్దలయ్యే వార్త. ప్రదీప్ కూడా...వారిలో..నో...నాకు లీలగా గుర్తుకొస్తోంది. అల తగిలిన క్షణాన నన్ను బలంగా బైటికి తోసేసిన ఆ చేతులు ప్రదీప్‌వి. ప్రదీప్ నా ప్రాణదాత. ఎవరో అంటున్నారు. ఈ ఏడాది బ్రేవరీ అవార్డు నాకు తప్పక వస్తుందని. రావచ్చు. రాకపోవచ్చు. కానీ నా ప్రదీప్‌ని నాకు మళ్ళీ ఎవరిస్తారు? మిగిలిన నలభైమంది ప్రాణాల్ని ఎవరు తెస్తారు? తప్పెవరిది? పిల్లల భద్రతకి బాధ్యత తీసుకోవడం చేతకాని స్కూలు యాజమాన్యందా? పిల్లల్ని గాలి కొదిలేసి తమ ఆనందంలో మునిగి తేలే టీచర్లదా? ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పిల్లలకి చెప్పడం మరిచి తామే కేవలం ఫైనాన్షియర్లుగా మిగిలిపోయే తల్లిదండ్రులదా?

★